# బంధితులు

నాగభైరవ ఆంజనేయులు

"ఏమైనా సరే ఈ రోజు మీరు వెళ్ళటానికి వీల్లేదు" పట్టుదలగా అంది కమల.

"ఏం ! ఎందుకని ?" కటువుగా ప్రశ్నించాడు నిలువుటద్దంముందు నిలబడి తల దువ్వుకుంటున్న శంకరం.

"నేను వెళ్ళనివ్వను" తన నిర్ణయాన్ని వ్యక్తం చేసింది కమల.

హేళనగా నవ్వుతూ ఆమె ముఖంలోకి చూసి నిర్లక్ష్యంగా స్నానాల గదివైపు నడిచాడు శంకరం.

ఆరునెలలనుండి అదేమాటను అంతే పట్టుదలగా అంటోంది కమల. ఆమె నిస్సహాయత తెలిసిన శంకరం ఆమె మాటను ఏనాడూ లెక్కచేయలేదు ఏ ఒక్కరోజూ అతన్ని ఆపలేకపోయింది కమల. తన అసమర్థతకు చింతిస్తూ అక్కడున్న కుర్చీలో కూలబడింది.

* * *

ఏడాది క్రితం శంకరం, కమల వివాహం వైభవంగా జరిగింది. వారి వివాహం జరిగింది అనేకంటే పెద్దవారు వాళ్ళిద్దరికీ పెళ్ళి చేశారు అంటేనే సబబుగా వుంటుంది. శంకరం నాన్న జగన్నాథానికి రాబోయే కట్నం నచ్చింది. కమల తండ్రికి కాబోయే అల్లుడి అంతస్తు నచ్చింది. ఆ కారణంగానే ఆ పెళ్ళి జరిగింది. మన దేశంలో జరిగే చాలా పెళ్ళిళ్ళ మాదిరిగానే కమల అభిప్రాయాన్ని ఎవరూ కనుక్కోలేదు. తాళి కట్టిన వాడినే ప్రేమించి, అతడికి అనుగుణంగా మారటమే మన సమాజంలోని ఆడపిల్లల సాంప్రదాయం. ఆ సాంప్రదాయాన్ని దాటలేనిది కమల.

శంకరం తనకా పెళ్ళి యిష్టం లేదన్నాడు. ఆ మాటకొస్తే ఎందుకు వద్దో కారణం చెప్పమని జగన్నాధం అడగనూలేదు. కమల మెడలో తాళి కట్టాలని శాసించాడు. శంకరం అలా చెప్పటానికి కారణం వసంత. వసంత ఆ వూరి వీధి బడిలో టీచర్‌గా పని చేస్తోంది. ఆ వసంతే తన జీవితంలో వసంతం చిలికించగలదని శంకరం గట్టి నమ్మకం. వసంత తన లేని బ్రతుకు నిస్సారమవుతుందనీ, వసంతే తన జీవితజ్యోతి అనీ శంకరం నమ్మకం. వసంతని చూడని రోజు పెద్ద లోటుగా తోచేది శంకరానికి, ఆరోజు కాలచక్రం ఆగిపోయినట్లు ఫీలయేవాడు, వసంత అందాన్ని ఆరాధించే వాడు శంకరం. ఆమెలోని ఆకర్షణ అతన్ని పిచ్చివాడిగా చేసింది. వసంత శంకరాన్ని ప్రేమిస్తుందో, అతడు వారసుడు కాబోయే అనినే ప్రేమిస్తుందో ఆమెకే పూర్తిగా తెలియదు. ప్రతి రోజు "మీరు నా ప్రాణం. మీరులేంది బ్రతకలేను." అని అంటుంది శంకరంతో. అలా అంటూ అతని క్రాపుని సుతారంగా సవరిస్తుంది. అతని కళ్ళతో మాట్లాడుతుంది. అధరాలలో అమృతం వుందో లేదో తేల్చుకుంటుంది. ఆ సమయాలే శంకరం ఆరాధనను పెంచాయని చెప్పవచ్చు.

ఈ వ్యవహారమంతా జగన్నాథానికి బాగా తెలుసు. వసంతతో మాట్లాడి 'మొండిఘటం' అని అనుకున్నాడు. చాలామంది మగపిల్లల తండ్రులల్లా వసంతను అవమానం చేయించే ధైర్యం జగన్నాథానికి లేదు. అందుకే ముందు శంకరాన్ని హెచ్చరించాడు, తరాత మందలించాడు, ఆపైన బెదిరించాడు. తండ్రిమీదున్న గౌరవం, భయం వసంతమీదున్న వ్యామోహాన్ని తగ్గించలేకపోయాయి.

"ఆ మూడుముళ్ళు పడితే వాడే దారిలో పడతాడు" అని అనుకున్నారు జగన్నాథం, ఓ ముహూర్తాన. ఆ ఆలోచన్ని అమల్లో పెట్టి, శంకరాన్ని అదుపులోపెట్టి ఎలాగయితేనేం కమలను కోడలుగా తెచ్చుకున్నాడు ఓ శుభముహూర్తాన.

శంకరం తండ్రిని ఎదిరించి వసంతను వివాహమాడగలడు, ఆ మాటే వసంతతో చెప్పాడు పెళ్ళికి ముందుగానే. ఆ మాట విని పకపకా నవ్వింది వసంత. వింతగా చూశాడు శంకరం

"డియర్... మన పెళ్ళే అయితే నన్నింట్లో వుండనివ్వడు మీ నాన్న. ఆస్తిలో చిల్లిగవ్వకూడా నీకు దక్కనివ్వడు. అప్పుడు మనం ఏం చేస్తాం" సాలోచనగా చూస్తూ ప్రశ్నించింది.

"ఎక్కడికయినా వెళ్ళి ఎంతక్కా బ్రతకచ్చు" శంకరం మాటలో ఉద్రేకం ఎక్కువగా కనిపించింది.

"ఎలా !... గాలి తిని బ్రతుకుతామా. ఉన్న ఉద్యోగం వస్తుందంటే మరో ఉద్యోగం దొరకటం మాటలా !"

"అయితే ఏం చేద్దాం"

"ఈ పెళ్ళి చేసుకో."

"నీకు మతి చలించలేదుకదా, నిన్ను మనసారా ప్రేమిస్తున్నా. మరొకరిని పెళ్ళి చేసుకోలేను."

"పిచ్చివాడా ! పెళ్ళి వేరు, ప్రేమ వేరు.

"అయితే నన్ను మర్చిపోవాలంటావా !" భయంగా అడిగాడు శంకరం.

"అలాగని చెప్పటం లేదు. పెళ్ళి చేసుకో మీ నాన్నతృప్తికోసం. పెళ్ళి కోరికలకు సంకెళ్ళు వేయలేదు... అందునా మగవాడికి. నీవు కమలను చేసుకోవాలి" శాసించినట్లు చెప్పింది వసంత.

ఇష్టం లేకపోయినా కాదని చెప్పలేకపోయాడు శంకరం. ఆమె చెప్పినట్లు చేయటమే గాని బాగోగులు ఆలోచించలేకపోయాడు. ఆ సమయం అలాంటిది. శంకరమే గాదు ఆ పరిస్థితిలో వున్న ఏ మగాడయినా అలానే చేస్తాడేమో !

* * *

స్నానం చేసి వచ్చిన శంకరం బయటకు పోవటానికి ఉద్రిక్తుడవుతున్నాడు. కమలలో సహనం సన్నగిల్లింది. రోషం వెల్లువలా ప్రవహించింది. గుండె గొంతులోకి నెట్టుకవచ్చింది. మనసు కంపించింది. ఈ నాటితో ఏదో ఒకటి తేల్చుకోవాలనే నిశ్చయానికొచ్చింది కమల.

"వసంత కావాలో, నేను కావాలో తేల్చండి. మీరు భార్య దృష్టితో నన్ను చూడటంలేదు. తాళి కట్టిన స్త్రీగా ఆదరించటంలేదు. చెప్పండి"

శంకరం కనుబొమ్మలు ముడుస్తూ విచిత్రంగా ఆమెకేసి చూశాడు. పక పకా నవ్వాడు.

'పిచ్చి ప్రశ్న. ఎవరు కావాలో ఇంకా నోటితో చెప్పాలా !"

"అయితే ఈ జీవితంలో స్థానంలేని నాకు ఈ యింట్లో పడివుండాల్సిన అగత్యం ఏముంది !" కమల కళ్ళలో నీళ్ళు చిలికాయి. పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని బలవంతాన ఆపుకొంది.

శంకరం నుండి ఏ సమాధానమూ రాలేదు.

"నేను పుట్టింటికి పోతాను" తన నిర్ణయాన్ని చెప్పింది కమల.

భర్తమీద కోపం వచ్చి భారతస్త్రీ బెదిరించటానికి అనే మాట ఇదొక్కటే. మరేం చేయలేరు సరికదా మరేదన్నా చేయాలనే తలంపుకూడా రానివ్వరు. వారు.

"ఇన్ని రోజులకు ఒక మంచి పనిచేస్తున్నందుకు సంతోషం". కమలకేసి తీక్షణంగాచూసి చర చరా బయటకు నడిచిపోయాడు శంకరం.

గాలి దుమారంలా విసురుగా మామ దగ్గరకు వచ్చింది కమల. చుట్ట చుట్టుకుంటున్న జగన్నాధం "ఏమమ్మా యిలా వచ్చావ్" అన్నాడు ఆప్యాయంగా.

"మామగారూ ! మీతో అవసరంగా మాట్లాడాలి"

"ఏమిటమ్మా ! చెప్పు"

"మీ అబ్బాయి వ్యవహారం మీకు పూర్తిగా తెలుసుకదా ! తెలిసీ నన్నెందుకు కోడల్ని చేసుకున్నారు ?" కమలలో పూర్తిగా నశించిన ఓర్పు సూటిగా ప్రశ్నించింది పెద్దవారనే సంకోచం లేకుండా.

"తెలుసమ్మా !...పెళ్ళి చేస్తే మారకపోతాడా అనుకున్నా...మరీ యింత బరితెగిస్తాడనుకోలేదు"

జగన్నాధం సమాధానం కమలను మరీ దెబ్బ



గొట్టింది. హృదయంలో నిండిన ఆవేదన వెళ్ళగక్కింది.

"మీరే గాదు, పెద్దవాళ్ళందరిలో యిదే మూఢ నమ్మకం కరుడుగట్టుక పోయింది. ఆ నమ్మకం కడిగివేయటం అంత సులభం కాదు. ఒక నిముషంలో వేసే ఆ మూడు ముళ్ళూ ఒక మనిషిని పూర్తిగా మార్చేయగలవా? ఆ ముళ్ళకు అంతటి శక్తే వుంటే, ఈనాడు యిన్ని పెళ్ళిళ్ళు ఎందుకు విఫలమవుతున్నాయి? పచ్చ తాడు కట్టినంత మాత్రాన మమకారాలు అనురాగాలు పుట్టుకొస్తాయనుకోవటం మన అవివేకమే అవుతుంది. ఏ ఆధారాలులేని ఈ నమ్మకాలతో తమ బిడ్డల భవిష్యత్తును పాడు చేస్తున్నారు చాలామంది. ఆడపిల్లల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు."

"అలా అనకమ్మా ... పెళ్ళి అయాక ఎందరు మంచిగా మారటంలేదు..."

"ఏదో కొందరు మారారని అందరూ అలానే మారుతారని భ్రమించటం సబబు కాదనుకుంటా."

జగన్నాధం మనసుని ఆలోచనలు తూనీగల్లా ముసురుకున్నాయి. తాను చేసిన పని తప్పా? శంకరం బ్రతుకుతోబాటు కమల జీవితంకూడా తన అనాలోచితానికి బలియి పోవాల్సిందేనా?

"మామగారూ! ఇక్కడ వుండి నేను చేయగలిగిందీ, చేయవలసిందీ ఏమీలేదు. అశక్తురాలిని. మరో మార్గం కనబడంలేదు. మా వూరు పోవాలనుకుంటున్నా. క్షమించండి."

"నీవు వెళ్ళి, వాడు యింకా చెడిపోవటానికి దోహదం చేయటం మంచిదికాదు సహనంతో వుండాలి. మంచికోసం ఎదురు చూడాలి. చెడ్డవాడని భర్తను వదిలి పోవటం కంటే ఆ భర్తను మంచిగా మార్చుకోవటానికి ప్రయత్నించటమే భార్య ధర్మం"

"ఏమో! దేనికైనా ఒక హద్దు వుంటుంది. ఆశ పూర్తిగా అరిపోయింది. ఈ ఆవేదన నేను భరించలేను. భర్త తన వునికినే గుర్తించక పోయినా అతని కోసం పరితపిస్తూ అదే తన లోకమని భావిస్తూ అతనే తన జీవితం అని తలచే ఉత్తమ స్త్రీలు వుండవచ్చు. అంతటి విశాల హృదయం నాకు లేదు.

"ఇన్ని రోజులూ అన్ని విధాల ప్రయత్నించాను. నా ప్రయత్నలోపమో లేక వారిలోని మూర్ఖత్వమో గాని వారిలో ఏ కొద్ది మార్పూ రాలేదు. ఇక నే భరించలేను ఈ బాధంతా. మన్నించండి మామయ్యగారూ"

* * *

'ఏమండీ...' శంకరం ఛాతీమీద మోచేతులు ఆన్చి అతని కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ గోముగా పిలిచింది వసంత.

"ఏం... వసూ ..." ఆమె ముంగురులతో ఆడుకుంటూ అడిగాడు శంకరం.

"మనం సంఘంలో జీవిస్తున్నాం. అందుకని మనిషే సంఘం కావాలని నేనటం లేదుగాని, ఆ సంఘపు కట్టుబాట్లలో వుండాలి కదా."

ఆమె మాటలకు అర్థం స్ఫురించలేదు శంకరానికి. అదే అన్నాడు ఆమె బుగ్గలను నిమురుతూ.

"నేను అవివాహితను. ఇంకెంత కాలం ఇలా సాగుతుంది. మీ కోసం లోకాన్ని లెఖ్ఖచేయటం లేదు. అయినా వారి సూటిపోటి మాటలు భరించలేకపోతున్నా" తన బాధను అతి నేర్పుగా వ్యక్తం చేసింది వసంత.

"ఆ విషయమే నేనూ ఆలోచిస్తున్నా. మా నాన్న గతించి ఏడాది దాటలేదు లోకులేమయినా అనుకుంటారు. త్వరలో పెళ్ళి చేసుకుందాం"

పక పకా నవ్వింది వసంత.

"ఎందుకలా నవ్వుతావ్" విసుగ్గా అన్నాడు శంకరం.

"మర్చిపోయావా! మీ భార్య వున్న సంగతి గుర్తుకు రాలేదా అబ్బాయిగారికి. ముందు ఆమెకు విడాకులివ్వండి. ఆ తర్వాత మన పెళ్ళి. విడాకులు ఇవ్వందే మనం పెళ్ళాడినా అది చెల్లదు."

"విడాకులా..." వినరాని మాట విన్నట్టుతన ఆశ్చర్యాన్ని ప్రకటించాడు శంకరం.

"ఏం...వింతగావుందా. ఇంకామీలో పెళ్ళాం మీద ప్రేమ మిగిలివుందా" అతని బుగ్గ మీద ముద్దుపెట్టుకుంటూ అంది, అతని గడ్డాన్ని అరచేత్తో సుతారంగా నిముర్తూ.

"అబ్బే... అదేంలేదు. ఆలోచిస్తా" తడబడ్డాడు శంకరం.

"అవును లెండి మోజు తీరేవరకు నేను. ఆ తర్వాత పరాయిదాన్నేగా. ఆస్తి అనుభవించేది

(మిగతా 41 వ పేజీలో)

# ఉగాదికి విన్నపం

—ప్రళయాగ్ని

ఎవరమ్మా నువ్వు ఏదో బోర్డు
కట్టుకుని వస్తున్నావు
కార్డుముక్కయినా రాయకుండా
అద్దంలాంటి వీళ్ళ జీవితాలు
బాధల రాళ్ళకు బద్దలయ్యాయని
పరామర్శిద్దామనా వచ్చావు.

మంచినీళ్ళకు కూడా ఎదురు చూసే
మట్టిగడ్డలాంటి బ్రతుకులు వీళ్ళవి
నల్ల సముద్రంలో ద్వీపం తెరచాపలెత్తి
అన్యాయాన్ని చుక్కాని చేసుకుని
లగెత్తిపోతూంది ఇక్కడ ప్రజాస్వామ్య నౌక

నల్లమందులాంటి బానిసత్వంనుండి తేరినా
కలుగుల్లో ఎలకల్లాగానే ఉన్నాం ఈ మూల
ఆశయాల దస్తావేజు
కాలదోషం పట్టేరోజు

నేడో రేపో అవతరించవచ్చు
గుబాళించ విక్కడ మల్లెలు
ఫలించ విక్కడ భూత ఫలాలు
అనలిక్కడ భూమి బంజరు
ఇక్కడుండడం చాలా డేంజరు.

# బంధితులు

(24 వ పేజీ తరువాయి)

మీరు మీ ముద్దుల భార్యా" విష్టూరమాడింది వసంత.

ఇప్పుడు ఆస్తిలో భాగం లేదనటానికి జగన్నాథం [illegible]ు. శంకరమే సర్వాధికారి.

వసంత వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

శంకరానికి చిరాకేసింది.

"లేదు వసంతా లేదు. ఎప్పటికీ నీవు నాదానివే." ఆమెను సముదాయించాడు శంకరం.

* * *

శ్రీవారి పాదపద్మములకు.

నమస్కృతులు. నన్ను పూర్తిగా మర్చిపోయివుంటారని భావిస్తున్నా. పెద్దవారి మూర్ఖత్వంవల్లనో, ఆ బ్రహ్మవ్రాసిన పొరపాటువ్రాతవల్లనో మనం దంపతుల మయ్యాం. కలిసి జీవించలేకపోయినా, మనసులు కలవకపోయినా, మనం భార్యాభర్తలమే. రెండు సంవత్సరాల నుండి క్షయవ్యాధి నన్ను చిత్రహింస పెడుతోంది. ఒక్కసారిగా ప్రాణంతీస్తే బావుంటుంది కాని ఈ రోగం అలా చేయటంలేదు. ప్రమాద పరిస్థితిలో శానిటోరియంలో చేర్చారు. కొద్దిగా కోలుకున్నా, త్వరలో తగ్గిపోతుందని, భయమేమీ లేదని డాక్టర్లు చెప్పారు. వారిమాటకు నవ్వొచ్చింది చచ్చే క్షణం వరకు రోగి బ్రతుకుతాడనే చెబుతారు డాక్టర్లు. అలా చెప్పి రోగికి చివరి దశలో సంతృప్తిని కలిగించటం వారి విధేమో!

అయినా నాకు తెలుసు యింకా ఎక్కువ రోజులు బ్రతకలేనని. పునిస్త్రీగా పోతున్న నేను ధన్యురాల్ని. చచ్చిపోతానన్న చింతేమీ లేదు. కాని... మీ నిశ్వాసను నా చివరి శ్వాసగా తీసుకోలేకపోయానన్న వ్యధతో నాకు బెంగగా వుంది. చివరిగా... ఈ లోకంలో నేను కోరుకున్న కోరికల్లో చివరి కోరికయినా నెరవేరితే నా జీవితం ధన్యమవుతుంది.

ఒకసారి మిమ్మల్ని చూడాలని, మనసులోని మాటను మీకు చెప్పాలని మనసు వువ్విళ్ళూరుతున్నది. ఈ నా కోరిక తీరుస్తారనే ఆశ వుంది.

కన్నీళ్ళతో,
మీ దాన్ని కాలేని
మీ అర్ధాంగి.

ఉత్తరం చదివిన శంకరం మనసులో ఆలోచనా కెరటాలు ఉవ్వెత్తున లేచాయి. మనసు మారుమూలలో దాగున్న విచక్షణా జ్ఞానం శంకరాన్ని పునిగొల్పింది. ఆలోచనా శక్తి మార్గం చూసింది. సహజంగా భార్యమీదుండే అనురాగం మమకారం ఆప్యాయతలు అతనిలో ఆ క్షణంలోనే మేల్కొన్నాయ్. భార్యాభర్తల మధ్య వుండే అనుబంధం శంకరాన్ని కదిలించింది. సత్సంకల్పంతో ముందుకు సాగాడు కర్తవ్య నిర్వహణను మననం చేసుకుంటూ.

* * *

"క...మ...లా..." కంపించే కంఠంతో పిలిచాడు శంకరం. అస్థిపంజరానికి చర్మం కప్పినట్టుంది కమల. ఆమెను చూసిన శంకరంలో దుఃఖం పెల్లుబికింది. రెండు చేతులతో ముఖం కప్పుకుని "నన్ను క్షమించు కమలా" అన్నాడు.

"వచ్చారా... మీరు వచ్చారా... నా కోరిక మన్నించారు. నా మీద దయ తలచారు..." సంతోషాన్ని ఆపుకోలేక పోయింది కమల.

"చెంతనున్న వెలుగుని చూడలేక చీకట్లోపయనిస్తున్న ఈ అంధుణ్ణి క్షమిస్తావ్ కదూ"

"అలా అనకండి. మీ ప్రేమకు నోచుకోని దురదృష్టవంతురాలిని మీ అనురాగాల్ని పొందలేని అభాగ్యురాల్ని. ఏమండీ నా కోరిక తీరుస్తారు కదూ' కమల తన చేతిని ముందుకి చాపింది. చేతిలో చేయి వేయమన్నట్టు, ఆ చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు శంకరం.

"చెప్పుకమలా చెప్పు"

"ఏమండీ! నేను మిమ్మల్ని సుఖపెట్టేస్థితిలో లేను. ఈ ప్రాణం త్వరలోనే మీ ఒడిలో నే వాయువుల్లో లీనమయిపోతుంది. తాళి కట్టిన మీకు ఏ సంతోషాన్ని పంచివ్వలేని నిర్భాగ్యురాలిని. మీరు...మీరు...వసంతను మీ దాన్నిగా చేసుకొని సంతోషంగా జీవించండి. అదే నేనుకోరేది. మీ ఆనందమే నాకు కావాలి. అదే నాకు ఆత్మశాంతి"

"కమలా" అసహనంగా అరిచాడు శంకరం. ఆమె నోటిని తనచేత్తో గట్టిగా మూశాడు. నీళ్ళతో నిండిన కళ్ళతో ఆమె ముఖంలోకి దీనంగా చూశాడు ఆమె చూపుల్లో కాంతిరేఖలు అలుముకున్నాయి.

"నా మాట వినండి. మీ జీవితం వసంతమయం కావాలి. మీరు తృప్తిగా వుండాలి".

"లేదు కమలా లేదు. ఇన్నిరోజులు వసంత వ్యామోహంలోపడి దేవత లాటి నిన్ను అర్థం చేసుకోలేకపోయాను. నిన్ను నిర్లక్ష్యంచేశా. ఇప్పటికి నాకు జ్ఞానోదయ మయింది. వసంత ప్రేమిస్తుంది నన్నుకాదు. నా డబ్బుని, వసంతకు కావలసింది ఆస్తి. ఆ ఆస్తి వల్ల పొందే భోగభాగ్యాలు. నీవు నాదానివి. కాదు... కాదు... నేను నీ వాడిని... కాదు .. కమలా... ఏమిటో... ఏం చెప్పాలో తెలియటంలా, అదే. మనిద్దరం ఒకటి...ఇద్దరి జీవితమూ ఒకటే అదే నిండుదనంగా వుంటుంది.

నీవు బ్రతుకుతావు కమలా తప్పక బ్రతుకుతావు. నీవు బ్రతికితీరాలి. నా కోసం బ్రతకాలి. నీవు లేనిదే నే వుండలేను. నేను బ్రతకటం కోసం నీవు బ్రతకాలి. నీవే నా జీవితానివి. నీవే నా వెలుగువి." శంకరం గొంతులో ఆరాటం ఆతృత స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కిటికీ నుంచి ప్రశాంతంగా వస్తున్న వెన్నెల వారిసిన [illegible] సరసుకొంది.

★